## స్వపరిచయం

ఆంగ్లాంధ్రాలలో కథా, వ్యాసరచన – హిందీ, ఇంగ్లీషులనుండి అనువాదాలు – "హాసం" పత్రిక మేనేజింగ్ ఎడిటర్‌షిప్ – ఎనిమిది సంపుటాల "ముళ్లపూడి సాహితీసర్వస్వం"కు సంకలనం, సంపాదకత్వం, – "హాసం" ప్రచురణల సంచాలకత్వం – వరల్డ్‌స్పేస్ శాటిలైట్ రేడియోలో రేడియోజాకీత్వం – వనితా టీవీలో "ఇదీ అసలు కథ" కార్యక్రమానికి రచన, వాయిస్ ఓవర్, యాంకరింగ్ – ప్రస్తుతం "గ్రేట్ ఆంధ్రా డాట్‌కామ్"లో 'ఎమ్బీయస్ కబుర్లు' కాలమ్ నిర్వహణ – ఇవీ నా విజిటింగ్ కార్డులు. ఒకప్పుడు స్టేట్ బ్యాంక్ ఆఫీసర్ని. ప్రస్తుతం కమ్యూనికేషన్స్ కన్సల్టెంట్‌ను.



*తెలుగులో 150 కి మించి కథలు రాశాను. అన్ని రకాల కథలూ రాయడం సరదా. ఈ మధ్య బహుమతులు కూడా వస్తున్నాయి. (ఏడాదిలోనే స్వాతి–సిపి బ్రౌన్ అకాడమీ కథల పోటీలో.., స్వాతి హాస్యకథల పోటీలో..,స్వాతి సరసకథల పోటీలో... చిత్ర హారర్ కథల పోటీలో... ఆంధ్రప్రదేశ్ హాస్యకథల పోటీలో..) హాస్యరచనకై తెలుగు యూనివర్శిటీనుండి 2010 కీర్తిపురస్కారం, ఆంధ్ర సారస్వత సమితి (మచిలీపట్నం) 2011 ఉగాది పురస్కారం యిచ్చారు. "ఇదీ అసలు కథ"కు 2010 టీవీ అవార్డుల్లో రజిత నంది ప్రకటించారు. నేను రాసిన 23 పుస్తకాలు మార్కెట్‌లో వున్నాయి.*

*క్రైమ్ రచనలంటే నాకు చాలా యిష్టం. చదవడమూ, రాయడమూ కూడా. ఎందుకంటే వాటిలో తర్కం వుంటుంది, ఆలోచన, మేధోమథనం వుంటాయి. నేరం చేసేవాడికి మామూలువాడి కంటె ఎక్కువ తెలివితేటలుండాలి. వాడెవడో తెలుసుకునే క్రమంలో మనమూ బుర్రకు పదును పెడతాం. అందుకే క్రైమ్ రచనలంటే రచయితలలో చాలామందికే కాదు, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి వంటి భావకవికి కూడా యిష్టమే. ఈనాటి తెలుగు పేపర్లలో క్రైమ్ కార్నర్ అంటే 90% అక్రమసంబంధాలతో నింపేస్తారు. కానీ క్రైమ్ పరిధి చాలా విస్తృతం. పురాణాల కాలం నుండీ క్రైమ్ వుంది. తొలిదంపతులు ఆడమ్, ఈవ్ పిల్లలిద్దరిలో ఒకడు మరొకణ్ని అసూయతో చంపేశాడు. మన పురాణాల ప్రకారం సృష్ట్యాదిలో విష్ణువు క్షీరసాగరంలో శయనిస్తూండగా అతని నాభినుండి బ్రహ్మ పుట్టినట్టే, చెవుల నుండి మధు, కైటభులనే దుష్టులు పుట్టారు. బ్రహ్మను యుద్ధానికి రమ్మనమని కవ్వించారు. బ్రహ్మ వేడుకోగా విష్ణువు మధుకైటభులను సంహరించాడు. అంటే క్రైమ్ మనతో బాటు పుట్టి మనతో ఎదుగుతోందన్నమాట. దాని గురించి క్షుణ్ణంగా తెలుసుకోకపోతే ఎలా?*

*నేను క్రైమ్‌లో పలు కోణాలను ఈ శీర్షిక ద్వారా పరిచయం చేద్దామని వుంది – దేశవిదేశాల తాలూకు రకరకాల మోసాలు, మోసగాళ్లు, రాజకీయపరమైన కుట్రలు, సెక్స్ స్కాండల్స్, స్కాములు, ఫ్రాడ్‌లు, ఆర్థికనేరాల గురించి వ్యాసాలు, చారిత్రక వాస్తవాలు, గూఢచారులు, డిటెక్టివ్‌ల జీవిత చిత్రీకరణలు, క్రైమ్ కథలు, నవలల, సినిమాల, వాటి సృష్టికర్తల పరిచయాలు... యిలా ఎన్నో !*

*అంతా మీ ప్రతిస్పందనపై ఆధారపడి వుంది.*

**ఎమ్బీయస్ ప్రసాద్**
mbsprasad@gmail.com

**ఎమ్బీయస్ క్రైమ్ రచనలు – 01**

## విషకన్యలు

ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికై అయిదేళ్లు మాత్రమే అధికారంలో వుండే నేటి పాలకులే ప్రాణరక్షణకై ఎంత జాగ్రత్తలు తీసుకుంటున్నారో ఎస్‌పిజి కమెండోలను, బ్లాక్ కాట్‌లను చూస్తే తెలుస్తుంది. మరి రాచరికపు రోజుల్లో వంశపారంపర్యంగా గద్దె కెక్కిన రాజు జీవితాంతం పాలించే పద్ధతి వున్నపుడు రాజులు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి ఎన్నో రకాల జాగ్రత్తలు తీసుకొని వుంటారని సులభంగా వూహించవచ్చు. ఎన్నో కుట్రలు, కుహకాలు, మంత్రాంగాలూ, వారసత్వపు పేచీలు ఎదుర్కొన్న తర్వాతనే ఎవరైనా గద్దె నెక్కగలిగేవారు. ఎక్కిన తర్వాత కూడా పరదేశాధిపతులతోనే కాక అంతఃపురంలోని దాయాదులతోనూ, ఆస్థానంలోని పాతరాజు విధేయులతోనూ అనుక్షణం పోరాడుతూనే వుండాల్సి వచ్చేది. శత్రువులను నాశనం చేయడానికి రాజులు అవలంబించిన ఉపాయాలలో 'విషకన్య' ప్రయోగం ఒకటి.

మారణాయుధాలు యిప్పుడున్నంత శక్తివంతంగా లేని ఆ రోజుల్లో శత్రు సంహారానికి విషం విరివిగా ఉపయోగించబడేది. ఆహారపానీయాలను వేరెవరైనా రుచి చూసిన తర్వాతనే ఆరగించే రాజులకు స్త్రీ విషయంలో మాత్రం ఆ పద్ధతి రుచించేది కాదు. అందుకని స్త్రీ ద్వారా మట్టుపెట్టేవారు. స్త్రీతో గడిపేటప్పుడు ఎవరైనా ఏకాంతమే వాంఛిస్తారు కూడా. అందువలన ఆపద వాటిల్లినప్పుడు

యితరులు, ముఖ్యంగా వైద్యులు అందుబాటులోకి వచ్చేసరికి కాలాతీతమై పోతుంది. రాజుగారికి కాలం చెల్లిపోతుంది.



అందుకే అన్ని మారణాయుధాల కన్న శక్తివంతమైన మరుని ఆయుధం – మదవతి ! కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో రాజు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి స్పష్టంగా హెచ్చరిస్తాడు – "రాజు తను వాడే వస్తువులన్నీ, పానపాత్ర నుంచి పదతి అవయవాలదాకా దాకా – మూలికలతో, జంతువుల రక్తంతో తయారు చేసిన ఔషధ జలంతో కడిగిన తర్వాతనే ఉపయోగించుకోవాలని.." ఎందుకంటే రాజు భోగించబోయే స్త్రీ తన మర్మాంగాలకు విషాన్ని పూసుకుని వుండవచ్చు. ఈ విధమైన ఔషధాభిషేకం వలన అలాటి విషం నిష్ఫలమవుతుంది. ఆ తర్వాత ఆమెను అనుభవించినా ఏమీ కాదు.

భాగవతంలోని పూతన తన స్తనాలకు విషం పూసుకునే కృష్ణుణ్ని చంపబోయింది కదా!

విషకన్యలను నాలుగు రకాలుగా వర్గీకరించారు –

01. తన అందచందాలతో ఎదుటి మనిషిని వశపరుచుకుని ఏకాంత సమయంలో అతని ఆహారంలోనో, పానీయంలోనో విషం కలిపేవాళ్లు

02. సుఖవ్యాధి నొకదాన్ని తగిలించుకుని తన శత్రువుతో రమించి, అతనికి ఆ వ్యాధి అంటగట్టేవాళ్లు

03. పెళ్లి కాగానే భర్తను కోల్పోతారని జ్యోతిష్కులు చెప్పినవాళ్లు (ఇలాటివాళ్లను వెతికి శత్రువుకి యిచ్చి పెళ్లి చేసేవాళ్లు)

04. క్రమక్రమేణా తన శరీరానికి విషాన్ని అలవాటు చేసి, వారితో వారితో సంపర్కం కలిగినవారిని మృత్యువుకు ఎర చేసేవాళ్లు

ఈ విషప్రయోగాలన్నిటిలో చావు వెంటనే సంభవించకపోవచ్చు. క్రమేణా ఆరోగ్యం క్షీణించి మరణించిన సందర్భాలలో విషకన్య పాత్ర తెలియకపోవచ్చు కూడా.

ఇవన్నీ కాక చూపులతోనే విషాన్ని ప్రసరింపచేసే 'దృగ్విషం' లేక 'దృష్టివిషం' కూడా మన పుస్తకాలలో చెప్పబడింది. అలెగ్జాండరుకు దండయాత్రలలో ఒక సర్పాల లోయ తారసిల్లిందట. ఆ పాముల చూపులే చాలట ఎదురువాణ్ని చంపడానికి ! అలెగ్జాండరు అద్దాలు ఏర్పాటు చేసి ఆ పాములు తమని తామే చూసుకునేట్టు చేసి వాటిని సంహరించాడట.

అలెగ్జాండరుకు రకరకాల విషాల గురించి, విషకన్యల గురించి అతని గురువు అరిస్టాటిల్ హెచ్చరించాడని 'సీక్రెటమ్ సీక్రెటోరం' అనే గ్రీకు పుస్తకంలో వుంది. అపరిచితులైన తూర్పుదేశాల వనితలతో శారీరక సంబంధాలు పెట్టుకోవద్దని హెచ్చరించాడు అరిస్టాటిల్. ఎందుకంటే విషప్రయోగం తూర్పుదేశాలలో ఎక్కువ. విషకన్య ప్రయోగం భారతదేశంలోనే ఎక్కువ. పర్షియా, మెసపొటేమియా, అరేబియా, సిరియా, ఆసియా మైనరు ప్రాంతపు జానపద సాహిత్యాలలో కూడా యీ ప్రసక్తి కనబడినా అదంతా భారతదేశపు ప్రభావంగానే చెప్పుకోవచ్చు.

అరిస్టాటిల్ భయపడినట్టుగానే ఒక భారతీయ రాజు తనపై దండెత్తి వచ్చిన అలెగ్జాండరుకు బహుమతిగా విషకన్యను పంపాడు. కానీ అలెగ్జాండరు గురువుగారి సలహా మన్నించి తనను తాను కాపాడుకున్నాడు. రాజులు ఒకరికొకరు కన్యలను బహుమతిగా పంపుకోవడం యీనాడు ఎబ్బెట్టుగా తోచవచ్చు. ఆనాటి ప్రభువులకు అందమైన స్త్రీలు కూడా విలువైన వస్తువులతో సమానం. యజ్ఞం చేయించిన పురోహితులకు రాజు దక్షిణ యిచ్చినా, సామంతరాజులు చక్రవర్తికి కప్పం కట్టినా – కానుకల జాబితాలో గోవులు, బంగారం, మణులతో బాటు కన్యామణులు కూడా వుండేవారు. అందువలనే విషకన్యాప్రయోగం సాధ్యపడింది.

జాతకరీత్యా చేపట్టినవాడిని కడతేరించేవాళ్ల గురించి వరాహమిహిరుడు వివరించాడు – 'నుదురు జారిపోయిన స్త్రీ భర్త సోదరుని చావుకు, పొట్ట జారిన స్త్రీ మావగారి చావుకు, పిరుదులు జారిన స్త్రీ భర్త చావుకు కారకురాలవుతుంది. బాగా పొడుగ్గా వుండి పై పెదవిపై రోమాలున్న స్త్రీ కూడా భర్తకు అపకారి అవుతుంది...' వీటిని నమ్మినవారు తాము నిర్మూలించ దలచుకున్న మనుష్యులను బట్టి దానికి తగిన స్త్రీని ప్రయోగించేవారు. వరాహమిహిరుడు యిచ్చిన ఉదాహరణల్లో – కాలి అందెలకు విషం పూసుకుని భర్తను చంపివేసిన కాశీరాణి, తన శిరోజాలలో చురకత్తి దాచుకుని విదురథ రాజును చంపివేసిన అతని రాణి వున్నారు !

పైన చెప్పినవారిలో నాల్గవ రకానికి చెందిన విషకన్యలను తయారుచేసే విధానం విచిత్రంగా వుండేది. తల్లి కడుపులో వున్నపుడే కొద్దికొద్దిగా విషం యిచ్చి, పుట్టి పెరుగుతూండగా మోతాదు పెంచుకుంటూ పోయేవారు. విషం హరాయించుకునే శక్తి పెరిగిన కొద్దీ విషం తీవ్రత, పరిమాణం పెరుగుతూ పోయేది. వాళ్లు అందంతో బాటు, ఆటాపాటా కూడా నేర్చి మగవారిని వశపరచుకునే నేర్పు సంపాదించేవారు. అందం విషయంలో కూడా విషసేవనం తమ అందాన్ని చెడగొట్టకుండా జాగ్రత్తలు తీసుకునేవారు.

అల్ కజీవీ రాసిన 'కాస్మోగ్రాఫిక్' ప్రకారం విషకన్య పసిపాపగా వుండగానే ఉయ్యాల కింద ఒక విషపు మొక్క వుంచి దాని



గాలి సోకేట్లు చేస్తారు. కొంతకాలానికి దానిని ఆమె పరుపు పక్కన పెట్టి ఆ విషాన్ని భరించే శక్తి అలవరుస్తారు. క్రమంగా పాలల్లో విషాన్ని కలిపి తాగిస్తూ విషకన్యగా తయారుచేస్తారు.

మనకందరకూ బాగా పరిచితమైన విషకన్యోదంతం "ముద్రారాక్షసం" నాటకంలో కనబడుతుంది. నందులను గద్దె దించిన చంద్రగుప్తుణ్ని సంహరించడానికి నందుల మంత్రి రాక్షసామాత్యుడు పన్నిన పన్నాగాలను, వాటిని చంద్రగుప్తుని మంత్రి చాణక్యుడు తిప్పికొట్టడాన్నీ ఆ నాటకం వివరిస్తుంది. రాక్షసుడు విషకన్యను చంద్రగుప్తునికి పంపుతాడు. (ఎన్టీయార్ తీసిన "చాణక్యచంద్రగుప్త"కు రచన చేసిన పింగళివారు రాక్షసుడు తన కూతుర్నే విషకన్యగా తయారుచేసి చంద్రగుప్తుడికి పంపినట్టు కథ రాశారు. నందుల పట్ల రాక్షసుని రాజభక్తిట. చిన్నప్పటినుండి మామూలుగానే పెంచి మధ్యలో విషం యిచ్చి విషకన్యగా మార్చినట్టు చూపించారు. దీనికి చారిత్రక ఆధారాలు లేవు) చాణక్యుడు చంద్రగుప్తుని హెచ్చరించి, ఆమెను పర్వతకునికి చంద్రగుప్తుని కానుకగా పంపుతాడు. నిజానికి పర్వతకుడు నంద నిర్మూలనకు చంద్రగుప్తునికి తోడ్పడి, అర్ధరాజ్యానికి హక్కుదారుడైనవాడు. ఈ విషకన్య వలన పర్వతకుడు మరణించడం, చంద్రగుప్తునికి ఆ రాజ్యభాగం కూడా దక్కడం జరుగుతుంది. (ఈనాటి గూఢచారి పరిభాషలో దీన్ని 'డబుల్ అండ్ ట్రిపుల్ ఏజంట్ హేండ్లింగ్' అంటారు)

ఈ విషకన్య విషం ఒక్కసారికే పనికి వస్తుందట. తర్వాత కూడినవాడికి ఏమీ కాదు. అందుకని చాణక్యుడు తన ప్రయోగాన్ని వ్యర్థం చేసిన తర్వాత "ముద్రారాక్షసం"లో రాక్షసుడు వాపోతాడు – "అర్జునుణ్ని చంపుదామని కర్ణుడు ఇంద్రుడిచ్చిన అస్త్రాన్ని దాచినట్టు నేనూ యీ విషకన్యను దాచాను. కానీ కర్ణుడు దానితో ఘటోత్కచుణ్ని చంపవలసి వచ్చింది. ఒక్కసారి మాత్రమే వాడగలడని షరతుంది కాబట్టి అర్జునుడు బతికిపోయాడు. ఈ నాడు నా విషకన్య కూడా పర్వతకుణ్ని చంపి, చంద్రగుప్తుడిని ఏమీ చేయలేకపోయింది. ఆమెను మళ్లీ వుపయోగించలేను కదా..!"

చంద్రగుప్తుడు క్రీ.పూ. 4 వ శతాబ్దం వాడు. విశాఖదత్తుడు "ముద్రారాక్షసం" నాటకాన్ని క్రీ.శ. 5 వ శతాబ్దంలో రాశాడు. నడుమ 900 ఏళ్ల వ్యత్యాసం వుంది కాబట్టి చారిత్రక ఆధారాలు అతి తక్కువగా దొరకడం వలన జనశ్రుతంగా వచ్చే కథలను చేర్చి నాటకం కూర్చబడింది. ఒక కథనం ప్రకారం పర్వతకుడు విషకన్యను విషయించడు. అగ్నిసాక్షిగా పెండ్లాడుతూ వుంటే ఆ వేడికి ఆమె అరచేతుల్లో పుట్టిన చెమట యితనికి తగిలి స్పృహ కోల్పోయి, కొద్దిసేపట్లోనే మరణిస్తాడు. వీటిలో ఎంత నిజముందో, ఎంత అతిశయోక్తి వుందో తెలియదు. సుశ్రుతుడు విషకన్యల గురించి చర్చించాడు కాబట్టి కొందరైనా యిటువంటి వాళ్లు వుండేవారని నమ్మవచ్చు.

కానీ 'సువబాహుత్తరి కథ'లో ధర్మదత్తుడు కామసుందర రాజుగారి కూతుర్ని వివాహమాడతానని కోరితే దుష్టబుద్ధి అయిన మంత్రి సిద్దార్థుడు ఆమె విషకన్య అని చెప్పి ధర్మదత్తుణ్ని మోసగిస్తాడు. 'కథాసరిత్సాగరం'లో కూడా విషకన్యల ప్రసక్తి వుంది.

విషకన్యతో ఎటువంటి సంబంధం ప్రాణాంతకమైనది? అన్న విషయం కూడా ఆమెలో వున్న విషాన్ని బట్టి వుంటుంది. ఆమెను సంభోగించినా, చుంబించినా, ఆమె చెమట తాకినా, శ్వాస పీల్చినా ప్రమాదకరమే. పెండ్లాడిన స్త్రీ విషకన్యయేమోనన్న అనుమానం చేత తొలిరాత్రి భర్త వేరెవరినైనా పంపించే అలవాటున్న జాతులు కూడా వున్నాయి ప్రపంచంలో. గుప్తుల యుగం తర్వాత, అంటే క్రీ.శ. ఆరవ శతాబ్దం తర్వాత విషకన్యలు కథలలోను, సినిమాలలోను తప్ప చరిత్రలో కనబడరు.

విషకన్యలతో బాటు ఔషధ కన్యలు కూడా వుండేవారు. చిన్నప్పటినుంచీ మందులతోనే పెంచబడి, రోగపీడితులైన రాజుల సమక్షంలో మసలుతూ వారిని ఆరోగ్యవంతుల్ని చేసేవారు. వారితో క్రీడించడం వలన కూడా స్వస్థత చేకూరేదట. మానసికోల్లాసం కూడా ఆరోగ్యదాయకమే కదా !

శత్రురాజులను చంపడానికి విషకన్యలను ఉపయోగించినట్లే విషప్రయోగాల నుంచి తనను తాను కాపాడుకోవల్సిన అవసరం కూడా రాజుకుండేది. కృష్ణదేవరాయ లంతటి వాడి కొడుకే విషప్రయోగంతో మరణించాడంటే సమస్య ఎంత తీవ్రమైనదో అర్థం చేసుకోవచ్చు. అందువలన స్వయంగా విషాన్ని ఆరగించి, హరాయించుకుని విషపురుషులుగా మారినవారూ వున్నారు. కరెంటు షాకులు తినితిని 'ఇమ్యూన్' అయిపోయిన ఎలక్ట్రీషియన్ శరీరంలాగ విషం సేవించి సేవించి వీరి శరీరం విషానికి 'యిమ్యూన్' అయిపోతుంది. మామూలు మనుషుల ప్రాణాలు తృటిలో తీయగల విషం కూడా వీరినేమీ చేయలేదు. నాదిర్ షా (1688–1747) అటువంటి విషపురుషుడేనట. అతని పళ్లు తోమే బానిసలు ఒక్కొక్కపుడు మూర్ఛపోయేవారు. వారిలో ఒకడు చచ్చిపోయాడు కూడా !

గుజరాత్ నేలిన మహమ్మద్ షాను విషప్రయోగాల బారి నుంచి రక్షించుకోవడానికి అతని తండ్రే అతన్ని విషపురుషుడిగా మార్చివేశాడు. తన మీద కుట్ర పన్నుతున్నారని అనుమానించిన వారిని మహమ్మద్ షా వింతరీతిలో చంపేవాడు. వారిని తన గదికి

రప్పించి బట్టలు విప్పి నిలబెట్టేవాడు. ఆ తర్వాత తన తాంబూలంతోపాటు విషం నములుతూ వాళ్ల ఒంటి మీద ఉమిసేవాడు. అంతే ! అవతలి వ్యక్తి గిలగిలా కొట్టుకుని క్షణాల్లో మరణించేవాడు. ఇతనికేమీ అయ్యేది కాదు.

మరి అటువంటివాడితో ఒక రాత్రి గడిపిన యువతి గతి ఏమవుతుందో వేరే చెప్పనక్కరలేదు. తెల్లవారేసరికి శవమై పోయేది. అతనికి నచ్చిన పడతి నెవరినైనా ప్రాణాలతో వుంచదలచుకుంటే వారికి మాత్రం ఒక ఉంగరం యిచ్చి వేలికి తొడుక్కోమనేవాడు. దానిలో వున్న విషమణి కారణంగా ఆమెపై విషప్రభావం పడేది కాదుట!

ఇవన్నీ తెలుసుకున్నాక ఒక ఆలోచన మనలో మెదలుతుంది – మనం దేశాధినేతలమై వుండి శత్రువుల చేతిలో చావే రాసిపెట్టి వుందనుకోండి. అంగరక్షకుల చేత కాల్చబడో, మానవబాంబుల చేత పేల్చబడో చచ్చేకంటే హాయిగా విషపురుషుని పరిష్వంగంలోనో, విషకన్యల ఒడిలోనో ప్రాణాలు విడవడం మేలు కదా ! అని !

**– ఎమ్బీయస్ ప్రసాద్**

**(సమాచార సేకరణకు ఉపకరించినవి – ఎస్.డి.త్రివేది రాసిన సీక్రెట్ సర్వీసెస్ యిన్ ఏన్షంట్ ఇండియా, హిందీ పత్రిక 'కాదంబిని' (1974 మే సంచిక)లో 'విషకన్యాయే ఔర్ ఔషధ్ కన్యాయే' వ్యాసం, యువభారతి ప్రచురణ 'సంస్కృత సాహితీ లహరి'లో అవధానం చంద్రశేఖరశర్మ 'ముద్రారాక్షసం' పై రాసిన వ్యాసం)**

● ● ●